క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఎంపీడీఓలు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాకు కేటాయించిన ట్రైనీ ఎంపీడీఓలు కలెక్టర్ పి. రాజాబాబును బుధవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఏడుగురు ట్రైనీ ఎంపీడీఓలను క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం జిల్లాకు కేటాయించారు. బి. ప్రణవి, బి. భార్గవి, పి. అనూష, ఆర్. ఫణీందర్‌రెడ్డి, ఆర్. లోహిత జయసాగర్, కె. కిరణ్‌కుమార్, సీహెచ్ వెంకటేష్‌లు కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ వారికి పలు సూచనలు చేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని మహిషాసుర మర్దని అమ్మవారికి భక్తులు బుధవారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, పిండివంటలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు తీసుకువచ్చిన సారెను అమ్మవారి ప్రతిమ వద్ద ఉంచారు.

స్పోర్ట్స్ వింగ్ రాష్ట్ర కన్వీనర్‌గా బొమ్మిడి ప్రభు

కోనేరుసెంటర్: గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పోర్ట్స్ వింగ్ రాష్ట్ర కన్వీనర్‌గా బొమ్మిశెట్టి శివ నాగ ప్రభు నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో శివ నాగ ప్రభు నియమితులయ్యారు. ప్రభు బందరు మండలం పోతేపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

నేడు సాగు, తాగునీరు విడుదల

మోపిదేవివార్పు(మోపిదేవి): దివిసీమకు తాగు, సాగునీటిని గురువారం ఉదయం 8 గంటలకు మోపిదేవి వార్పు అక్విడెక్టు వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విడుదల చేస్తారని ఇరిగేషన్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అగ్ని బాధితురాలికి సాయం

పుచ్చగడ్డ(చల్లపల్లి): లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో వృద్ధురాలు గొరిపర్తి వెంకటేశ్వరమ్మకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవిస్తున్న బాధితురాలికి రెడ్ క్రాస్ చల్లపల్లి శాఖ ఆధ్వర్యంలో ఇడ్లీ పాత్ర, మినప గుళ్లు, ఇడ్లీ రవ్వ, రెడ్ క్రాస్ జిల్లా శాఖ సమకూర్చిన నిత్యావసర వస్తువులు, టార్పాలిన్ అందజేశారు. తహసీల్దార్ కె. గోపాలకృష్ణ, రెడ్ క్రాస్ చల్లపల్లి శాఖ చైర్మన్ నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, ఉపాధ్యక్షులు పేరం మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

9 ఎకరాల వరిగడ్డి దగ్ధం

చల్లపల్లి: అగ్ని ప్రమాదంలో తొమ్మిది ఎకరాల వరి గడ్డి దగ్ధమైంది. బుధవారం స్థానిక ఇస్లాం నగర్‌లో వేముల వెంకటేశ్వరరావుకు చెందిన ఆరు ఎకరాలు, వేముల శ్రీనివాసరావుకు చెందిన మూడు ఎకరాల వరి గడ్డి ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. బాధితులకు రూ.90 వేల నష్టం వాటిల్లింది. అవనిగడ్డ అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి బాధితులను పరామర్శించారు.

వైద్య సిబ్బందికి సన్మానం

గూడూరు: ఇటీవల బదిలీ అయిన గూడూరు ఆస్పత్రి వైద్యాధికారి కె.జ్ఞానరత్న, స్టాఫ్ నర్సులు పద్మావతి, హేమలత, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ఫార్మసిస్ట్ కల్యాణిలను బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, సీహెచ్‌సీ డైరెక్టర్లు ఎంఏ సలీమ్, బత్తిన త్రినాథ్, సర్పంచి లింగం సులోచనారాణి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు రైతు బజారుకు సెలవు

పెడన: వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత ఉప్పాల రాంప్రసాద్ సంస్మరణ సభను పురస్కరించుకుని ఆయనకు సంఘీభావంగా రైతు బజారుకు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించామని రైతు బజారు రైతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి అనుమతి తీసుకుని సెలవు ప్రకటించామన్నారు.

పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టండి

అధికారులతో ఎమ్మెల్యే పేర్ని నాని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని, చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో సొంత ఇల్లు లేని అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి అధికారులతో బుధవారం పలు అంశాలపై ఆయన చర్చించారు. పేర్ని నాని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన లే అవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. 90 రోజుల్లో ఇంటి పట్టా మంజూరు చేసేలా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఏయే లే అవుట్లలో ఖాళీలు ఉన్నాయో ఆ ప్రాంతాలను గుర్తించి వారికి ఇళ్ల పట్టాలను కేటాయించాల్సి ఉందన్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు లే అవుట్ల వారీగా ఖాళీగా ఉన్న స్థలాల సంఖ్యను పరిశీలించి దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా ప్రాంతాల్లో పట్టాలు ఇవ్వాలన్నారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి పేర్ని నాని తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కరగ్రహారం లే అవుట్‌లో పట్టాలు ఇవ్వాల్సిన లబ్ధిదారుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరాసుపేటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన భూమిలో దేవదాయ శాఖ భూమి మినహా మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ కావడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కోరారు. పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైలు మార్గానికి రెండో విడత భూ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చామని, దీనికి మార్కెట్ ధర నిర్ణయించేందుకు అనుమతులకు నివేదికలు పంపాలని సమావేశంలో నిర్ణయించారు. ఆర్డీఓ ఐ. కిషోర్, ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, తహసీల్దార్ శ్రీవిద్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాధిక, ఆర్ఐ యాకూబ్, సర్వేయర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసి ముస్లింల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పేర్ని నాని

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

మచిలీపట్నంటౌన్: నగరంలో తాగునీటి ఇబ్బంది ఎదురయ్యే ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. రెండో డివిజన్‌లోని పాత తవుడు ఫ్యాక్టరీ ఏరియాలో తాగునీటి సరఫరా కోసం మూడు కిలోమీటర్ల మేర రూ. 47.35 లక్షల అమృత్ పథకం నిధులతో చేపట్టిన పైప్‌లైన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రెండో డివిజన్‌లో ఇప్పటి వరకు రూ. 4.90 కోట్లతో పలు అభివృద్ధి చేపట్టామన్నారు. స్థానిక ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్పొరేటర్ పరింకాయల విజయచంద్రకుమార్‌తో పాటు డివిజన్ పెద్దలు, ముస్లింలు ఎమ్మెల్యే పేర్ని నానిని ఘనంగా సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నాలుగో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వడ్డి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం-1 పరిధిలోని ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, పంచాయతీ ఏరియా, పీఏసీఎస్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే 275 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిత్యం జగన్‌పై విమర్శలు చేసే ప్రతిపక్ష పార్టీలు ఏ ఒక్కటీ కూడా ఒంటరి పోరుకు సిద్ధంగా లేవన్నారు. అన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీనే ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నారని వివరించారు. అనంతరం గ్రామంలోని జగనన్న విలేజ్ క్లినిక్‌ను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ భవితలతో మాట్లాడి ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఏపీ ఉర్దూ అకాడమీ పాలక మండలి సభ్యురాలు షేక్ దిల్‌షాద్ నజరానా, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

పేర్ని కిట్టు



బ్రోచర్ అందజేసి పథకాలు వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. తపసిపూడి గ్రామంలో బుధవారం గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. గ్రామానికి చెందిన శ్రీపతి నాగలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తమ కుటుంబానికి అందిన లబ్ధిని వివరించి ఆనందం వ్యక్తంచేసింది. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, నియోజకవర్గ కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, చిటికిన నాగేశ్వరరావు, సర్పంచ్ చందన మస్తాన్, పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, చిలకలపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు బోయిన నాగబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



లక్ష్మీపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కార్యక్రమ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. 28 శాతం ఓటర్లు ఉన్న కాపులు కొందరు తమ సామాజిక వర్గం నుంచి సీఎం రావాలని పవన్ కల్యాణ్ వైపు చూస్తే ఆయనేమో చంద్రబాబును సీఎం చేస్తానని చెబుతుంటే కాపులు హర్షించరన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి గ్రామ సమైక్య సంఘాలు (వీఓ), బుక్ కీపర్లు కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం డి. శ్రీను అన్నారు. స్థానిక మండల సమైక్య కార్యాలయంలో వీఓలు, బుక్ కీపర్ల అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

విద్యే పిల్లలకు ఇవ్వగలిగిన ఆస్తి

మంత్రి జోగి రమేష్

పెడన: చదువులే పిల్లలకు ఇవ్వగలిగిన ఆస్తి అని, వారి చదువుకు ఖర్చు చేసే మొత్తం వారి భవిష్యత్తుకు పెట్టుబడి అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పెడన నియోజకవర్గంలో అమ్మ ఒడి ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 16,685 మందికి లబ్ధి చేకూరిందని మంత్రి పేర్కొన్నారు. 2022-23 ఏడాదికి సంబంధించి పెడన పట్టణం, మండలంలో 5,124 మంది, బంటుమిల్లి మండలంలో 3,642 మంది, గూడూరు మండలంలో 3,697 మంది, కృత్తివెన్ను మండలంలో 4,222 మంది విద్యార్థులకు అమ్మ ఒడి ద్వారా రూ.25.27 కోట్లు తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని మంత్రి వివరించారు.

వైఎస్సార్ బీమా అందజేత

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన గరికిపాటి సీతారామాంజనేయులు ఇటీవల మృతిచెందారు. మృతుని భార్య హరితకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ. 10 వేలను గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. మిగిలిన నగదు నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబరావు వివరించారు. మండల గ్రామ సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గరికిపాటి రేణుకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వద్దు

మచిలీపట్నం ఆర్డీఓ కిశోర్



కంప్యూటర్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిశోర్

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు సంబంధించిన వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీఓ ఐ. కిషోర్ అన్నారు. బుధవారం ఆయన బల్లిపర్రు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. జూలై ఒకటో తేదీన బల్లిపర్రు సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించనున్న నేపథ్యంలో తీసుకున్న చర్యలపై ఆర్డీఓ ఆరా తీశారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు టోకెన్లు ఎంతమందికి జారీ చేసింది, ఏయే సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసింది, ఎలా అప్‌లోడ్ చేసింది అనే విషయాలపై కంప్యూటర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ క్యాంపు సమయంలో అధికారులంతా ఉంటారని, ఆ సమయంలో ఎటువంటి పొరపాట్లు బహిర్గతమైనా అభాసుపాలు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలన్నారు. తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య పాల్గొన్నారు.

క్యాంపుల నిర్వహణ ఇలా...

జూలై ఒకటిన బల్లిపర్రు, 3న మడక, 4న కాకర్లమూడి, 5న జింజేరు, 6న పుల్లపాడు, 7న చోడవరం, 10న పెనుమల్లి, 11న నందిగామ, 12న నడుపూరు, 13న కొంకేపూడి, 14న గురువిందగుంట, 15న కొప్పల్లి, 17న కమలాపురం, 18న చేవేంద్ర, 19న ఉరివి, 20న చెన్నూరు, 21, నందమూరు గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు.

పట్టణంలో క్యాంపుల షెడ్యూల్

జూలై 1న ఒకటో సచివాలయం, 3న రెండో సచివాలయం, 5న మూడో సచివాలయం, 7న నాలుగో సచివాలయం, 10న ఐదో సచివాలయం, 12న ఆరో సచివాలయం, 14న ఏడో సచివాలయం, 17న 8వ సచివాలయం, 19న 9వ సచివాలయం వద్ద క్యాంపులు నిర్వహిస్తారని కమిషనర్ బి. మహేంద్ర వివరించారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య బుధవారం సందర్శించారు. సబ్‌జైలులో గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వారు ఎక్కువగా ఉండటంతో న్యాయమూర్తి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ గంజాయి వినియోగం వల్ల నేర ప్రవృత్తి అలవాటు పడుతుందని, దీని ద్వారా శిక్షలు అనుభవించాల్సి వస్తుందని చెప్పారు. శిక్ష పూర్తయిన అనంతరం ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని మంచివారుగా మారాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. అనంతరం శిక్ష అనుభవిస్తున్న వారికి అందుతున్న ఆహార పదార్థాలను, రికార్డులను పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, సబ్ జైలు సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

నేడు రాంప్రసాద్ సంస్మరణ సభ



పెడన: కుటుంబ సభ్యులతోపాటు అనుచర వర్గమంతా అభిమానంతో పెద్దాయనా అని పిలుచుకునే ఉప్పాల రాంప్రసాద్ సంస్మరణ సభ గురువారం పెడనలో నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. బంటుమిల్లి రోడ్డులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై రాంప్రసాద్‌కు ఘన నివాళులు అర్పించనున్నారు. ఉప్పాల రాంప్రసాద్ కృష్ణా జిల్లా కూడూరు పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో పుట్టి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారు. మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన రాంప్రసాద్ జెడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం తన మరదలు రాజకుమారిని కూడా జెడ్పీటీసీగా గెలిపించి పట్టు నిలుపుకున్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం తర్వాత టీడీపీని వీడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వైఎస్ జగన్ కూడా రాంప్రసాద్ కుటుంబంపై ఆదరణ చూపారు. 2019లో అధికారం చేపట్టిన తర్వాత కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని (జనరల్ మహిళ) రాంప్రసాద్ కోడలు ఉప్పాల హారికకు ఇచ్చారు. రాంప్రసాద్ మృతి విషయం తెలిసి వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. రాంప్రసాద్ లేని లోటు పూడ్చలేనిదని సంస్మరణ దినం సందర్భంగా ఆయన ప్రస్థానాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

నేడు శ్రీమన్నారాయణుడికి అభిషేకాలు

కోడూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి మూల మూర్తికి గురువారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామీజీ బుధవారం తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి, వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలతో అభిషేకాలు జరుగుతాయన్నారు. అనంతరం స్వామివార్లకు పల్లకీ సేవ, నగరోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.





పీవీ నరసింహారావుకు ఘన నివాళి

మచిలీపట్నంటౌన్: భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం బుధవారం స్థానిక మునిసిపల్ గ్రంథాలయం సమీపంలోని నరసింహారావు విగ్రహం వద్ద నిర్వహించారు. పలువురు నగర ప్రముఖులు నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రధానిగా పనిచేయడం ఆంధ్రులకు గర్వకారణమన్నారు. రాష్ట్ర విభజనను వ్యతిరేకించిన వ్యక్తుల్లో పీవీ నరసింహారావు ముందుండేవారని చెప్పారు. ప్రధానిగా పనిచేసిన సమయంలో నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడం వల్లే నేడు భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ సంఘ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లి: భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, పీవీ అభిమాన సంఘం అధ్యక్షులు నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, ఆర్ఐ కిరణ్, డీటీ శారద, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

పెడన: పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన రెహానా భర్త మక్బూల్‌బాషా 15 రోజుల కిందట మృతిచెందాడు. కుటుంబం గడవడం కష్టంగా మారింది. పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ.15 వేల నగదు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

3న సత్యదేవుని వ్రతం

నాగాయలంక: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని జూలై 3వ తేదీన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తామని హిందూ ధర్మ ప్రచార పరిషత్ మండల ధర్మాచార్యులు రేమాల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భావదేవరపల్లిలోని భావన్నారాయణ స్వామి ఆలయంలో వ్రతం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

